కథ

# చెయ్యని నేరం- చేసిన తప్పు

భువన భర్త పోయాడన్న వార్త నాకింకా తెలీనే లేదు! పదో రోజు కర్మకు రమ్మని కార్డొచ్చింది. స్థాణువయ్యాను.

చనిపోయినతని గురించి బాధపడడం వేరే విషయం. బ్రతికున్న భువన గతేంటి? ముప్పై మించదు వయసు. పెద్దగా చదువుకోలేదు, ముగ్గురాడ పిల్లలు. మండిపోతున్న ఈ రోజుల్లో నిండు జీతమే ఓ పంటి కిందికి రాకుండా వున్న పరిస్థితుల్లో దీని భవిష్యత్ ఏంటి? ఏం తింటుంది? ఏం పెట్టి పిల్లల్ని చదివిస్తుంది? పెంచి పెద్దచేసి పెళ్ళిలా చేస్తుంది? ఇవన్నీ భువన ఇంకా ఆలోచించిందో లేదో గానీ నా బుర్రలో గింగుర్లెత్తిపోయాయి.

శ్రీవారికి ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పి, భువనా వాళ్ళ వూరు బయలుదేరాను. ఇక్కడికి రెండుగంటల ప్రయాణపు దూరం. దారి పొడుగునా నా కళ్ళు చెమర్చుతూనే ఉన్నాయి. చిన్నప్పటి జ్ఞాపకాలు, కలిసి ఆడుకున్న ఆటలు, కన్నకలలు సినిమా రీళ్ళలా మదిలో తిరుగుతున్నాయి.

ఇద్దరం ఇంటరు దాకా కలిసి చదువుకున్నాం. అనుకోకుండా సంబంధం తోసుకొస్తే ఇంటరు పరీక్షలకు ముందు భువనకు పెళ్ళి చేశారు ఆమె తల్లితండ్రులు. ఇంటరు పూర్తి కానందుకు ఎంతేడ్చిందో భువన!

'బావగార్నడిగి ఎగ్జామ్స్ రాద్దువు గాని. దానికింత ఏడుపెందుకే?' అన్నాను నేను. అనడమే కాదు, భువన భర్తని డైరెక్టుగా అడిగేసాను. 'ఏమండీ పంపిస్తారు కదూ?' అని.

అతను నవ్వి వూరుకున్నాడు. భువన ఆ ఏడు ఇంటరు పరీక్షలు రాయలేదు. చదివేం ఉద్ధరించాలందిట అత్తగారు. ఆ తర్వాతేటినుంచీ వరసగా కాన్పులు, ఎబార్షన్లు. ఇప్పటికిలా పైకి తేలింది. ఇహ ఏ ఒడ్డుకి కొట్టుకుపోతుందో చూడాలి.

నేను వెళ్ళేసరికి భువన పుట్టింటివైపూ, అత్తింటివైపు బంధువర్గమంతా మోహరించి ఉన్నారు. ఆ యింటి యజమానురాల్ని అంటే భువనని ఓ మూల గదిలో తలుపేసి కూర్చోబెట్టారు.

దాన్ని చూడగానే ఏడుపాగింది కాదు నాకు.

"అంతా అయిపోయిందే. మమ్మల్ని అనాథల్ని చేసి వెళ్ళిపోయారు బావ," అంటూ నా వళ్ళో పడి ఏడ్చేసింది.

ఎవరో పెద్దవాళ్ళొచ్చి సముదాయించే దాకా యిద్దరం అలా ఏడుస్తూనే ఉన్నాం. ఇంతలో భువన బావగారేవో కాయితాలు పట్టుకుని వచ్చారు. వాళ్ళ మధ్యన నేనెందుకని యివతలకొచ్చాను. భువన తల్లిని పలకరిద్దామని ఆవిణ్ణి వెతుక్కుంటూ వెళ్ళాను. అంత స్వతంత్రంగా తిరుగుతున్న నన్ను వింతగా చూశారు చాలామంది.

"పెరట్లో జామచెట్టు క్రింద కూర్చుని సన్నగా ఏడుస్తోంది భువన తల్లి. "పెన్నీ, ఏమిటిది? ఎలా జరిగింది? యాక్సిడెంటా? భువనని అడగడానికి నోరు రాలేదు" అంటూ ఆవిడ పక్కన చతికిలబడ్డాను.

"అంతా ఖర్మ. మా ప్రారబ్దం. ఏదైతేనేం. నీ స్నేహితురాలి బ్రతుకు తెల్లారిపోయిందమ్మా!" అని నా చేతులు పట్టుకుని వలవల ఏడ్చిందావిడ. అంత పెద్దావిణ్ణెలా ఓదార్చాలో నాకు తెలీలేదు.

కాసేపటికి సర్దుకుని చుట్టూ చూసి లోగొంతుకతో చెప్పింది. ఆవిడ చెప్పిన మాటలు నాకు దిగ్భ్రమని కలిగించాయి.

భువన భర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఫీసు డబ్బు ఇరవై వేలు వాడేసాడని పుకారుగా ఉందట. గుట్టు చప్పుడవకుండా ఆ డబ్బుకు కట్టేద్దామని కాబోలు, చనిపోయే రోజు సాయంత్రం భువన వంటి మీద బంగారమంతా తీసుకుని అది కట్టేసి వచ్చి నిద్రమాత్రలు మింగేశాడు.

"ఊర్నిండా అప్పులే. మెట్లు మెట్లు పుస్తకాలు కొనేసాడా, ఆ పుస్తకాల వాళ్ళు యింటి చుట్టూ తిరుగుతున్నారు. భువన బావగారే ఈ విషయాలన్నీ చూసుకుంటున్నాడు. పోలీసు కేసవకుండా నానా పాట్లు పడ్డాడు," ఆవిడ కళ్ళొత్తుకుంటూ అంది.

భువన భర్త ఆఫీసు డబ్బు వాడేడంటే నాకు అపనమ్మకం కలిగింది. నాకు తెలిసినంత వరకూ అతనలాంటి వాడు కాడు.

"నేనూ నమ్మలేకపోతున్నాను శాంతీ! పిల్లలు స్కూల్లో దొరికిందని పెన్సిలు ముక్క తెస్తేనే ఒప్పుకోని మనిషి ఆయన. ఇల్లూ, ఆఫీసూ, లైబ్రరీ తప్పించి మరో ప్రపంచం తెలీదే. ఆయన్ని కట్టుకున్న దాన్ని కదే నేను" అని ఏడ్చింది భువన నేను మళ్ళీ వెళ్ళి తన దగ్గిర కూర్చున్నపుడు.

"మీ బావగారేం చెప్తారు?"

"ఆయనకేం తెలుసు? లెక్కల్లో ఏదో తేడా వచ్చిందన్నారు,"

"నేనిలా అడుగుతున్నానని మరోలా అనుకోకు. మీ ఆయన డబ్బేమైనా వచ్చిందా?"

"గ్రాట్యుటీ వచ్చిందట. పోస్టాఫీసు వాళ్ళు చాలా తొందరగా యిచ్చేస్తారు, అన్నీను. ఇందాకే సంతకాలు పెట్టించి తీసుకెళ్ళారు బావగారు".

"పిచ్చిమొద్దూ! ఆయన చేతిలో పెడ్తే నువ్వూ, పిల్లలూ ఏం కాను?" తల కొట్టుకున్నాను.

"ఏం చెయ్యను? నే వెళ్ళే పరిస్థితి కాదుగా!" నిర్లిప్తంగా అంది.

"ఈ గొడవలన్నీ అయ్యేదాకా పేమెంటు తీసుకోకపోతేనేం? ఐదారువేలు కావాలంటే మేం సర్దుతాం" అన్నాను.

"పోలీసుకేసుకీ, దానికీ చాలా అయింది. అంతా మా బావగారే పెట్టారు. నేనైనా ఎవరో ఒకర్ని నమ్మాలి కదా శాంతీ! ఏం కావల్సినా ముందు ముందు చూడాల్సింది వీళ్ళేగా?" అంది నిర్లిప్తంగా.

ఏం చెప్పాలో, నా మనసులో సుడులు తిరుగుతున్న బాధనెలా చెప్పాలో అర్థం కాలేదు.

పదో రోజు చాలా ఆర్భాటంగా జరిపించారు. సగౌరవంగా, సగర్వంగా భువనని విధవని చేశారు. చాలా ఖర్చైంది. ఇది సాంప్రదాయమనాలో, మూర్ఖత్వమనాలో నాకు తెలీలేదు.

వైధవ్యమంటే ఏమిటి?

భర్త పోవడం.

అంటే?

బ్రతుకులో శూన్యం ఏర్పడడం. అది ఎవరూ నింపలేనిది. ఈ బాధ ఆమెని నిలువునా దహించి వేస్తుంటే సాంప్రదాయాల పేరిట, ఏవో ఆచారాలని రుద్దడం అమానుషంగా అనిపించింది నాకు. అవమానించడంలా తోచింది. భువనని అలా చూడలేక తల దించుకున్నాను.

......................

పదో రోజు అక్కణ్ణుంచి వచ్చేసాక మళ్ళీ భువనని కలవడానికి వీలు పడలేదు. ఉద్యోగం, సంసారం ఈ ఝుంఝూటాల్లో నిండా మునిగిపోయాను.

భువన భర్త ఆఫీసు డబ్బు వాడాడంటే శ్రీవారు కూడా నమ్మలేక పోయారు. "ఛా! మధు అలాంటివాడు కాదు. చాలా ప్రిన్సిపుల్డ్ మనిషి." అన్నారు.

భువన బావగారు ఏదో పనుండి హనుమకొండ వచ్చారు. నేను ఆఫీసుకెళ్తుంటే దార్లో ఎదురయ్యారు. పలకరించాను. "భువనా, పిల్లలూ ఎలా ఉన్నారండీ? మళ్ళీ వద్దామనుకుంటే కుదర్నే లేదు," అన్నాను.

ఆయన ముఖం భువన ప్రసక్తితో అప్రసన్నంగా మారింది, "భలే పని చేసింది లేమ్మా నీ ఫ్రెండు. ఇంటి పరువూ, ప్రతిష్ట అన్నీ తుంగలో తొక్కి చప్రాసీ ఉద్యోగానికి వెళ్ళింది," అన్నాడు.

"భువన అటెండరు పోస్టుకెళ్ళిందా?" నమ్మలేనట్టడిగాను.

"ఏదో ఇంత పెన్షనొస్తోంది. ఇంత ముద్ద మేంపెడ్తాం. పిల్లల్ని చూసుకుంటూ ఉండమంటే, నామర్దా చేసి,

అడ్డమైనవాడి కప్పులూ కడిగే నౌకరీకి బయల్దేరింది'' ఆగ్రహంగా అన్నాడు.

నాకేమిటో ఆయన మాటలు వినాలనిపించ లేదు. 'ఊళ్ళో ఉంటారా ఇంకా?'' మాట మార్చాను.

"లేదమ్మా ఈ వేళే తిరుగుప్రయాణం''.

"అదేంటీ మా ఇంటికి రారూ?'' అయిష్టంగా అడిగేను. లోపల్లోపల భయమే. ఇంకా ఏం వినాలో భువన గురించని.

"మరోసారి వస్తానమ్మా! మీ ఆయన్ని అడిగినట్లు చెప్పు'' అని కదిలాడు.

ఆ రోజంతా నా మనసు మనసులో లేదు. మర్నాడుఆదివారం. తెల్లారింది. భువనని వెతుక్కుంటూ వెళ్ళాను. అత్తవారితో కలిసి ఉండడం లేదు. వేరే ఉంటోంది.

నన్ను చూసి, "ఈ అటెండరు ఇంటికి రావడానికి నీకు నామోషీ వెయ్యలేదా?'' అనడిగింది తడి కళ్ళతో.

"ఆ సంగతి తరువాత. నువ్వు చేసిన పని బాగోలేదు. కనీసం ఒక్కమాటైనా చెప్పకుండా ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నావు? అటెండరు పోస్టు తక్కువని కాదు నా అభిప్రాయం, సమాజపు దృక్పథాన్ని బట్టి అలా అనుకోవాల్సి వస్తోంది!'' అన్నాను.

"అంత దూరాన్నించీ ఎండని పడి వచ్చావు.ముందు కాళ్ళూ చేతులూ ముఖం కడుక్కో. కాఫీ ఇస్తాను. మీ వారు రాలేదేం?'' నా మాటల్ని దాటేస్తూ అంది భువన.

"ఏదో పనుందట'' చెప్పాను. సాయంత్రం దాకా ఉందామని వచ్చినదాన్ని, రాగానే పోట్లాడి మనసులు కష్టపెట్టుకోవడం దేనికని లేచి పెరట్లో కెళ్ళాను. నేను మళ్ళీ వచ్చేసరికి వుప్మా రెడీ చేసి ఉంచింది.

నేను వుప్మా తిని కాఫీ తాగుతుంటే నిదానంగా సంగతులన్నీ చెప్పింది.


"నిజానికి వుద్యోగంలో చేరాలని నేనూ అనుకోలేదు. ఆయన గ్రాట్యుటీ పాతికవేలూ మా బావగారే తీసుకున్నారు. పోలీసు కేసవకుండా చూడ్డానికీను, కర్మకీనూ..''

"చచ్చిపోయిన మనిషి కర్మకి అంత బార్లు బద్దలు కొట్టడం దేనికే బతికున్న మీ గురించి ఆలోచించకుండా? మీ వాళ్ళ మూర్ఖత్వాలు చూస్తుంటే నాకా రోజునేచాలా కోపం వచ్చింది'' మధ్యలో ఆపి అన్నాను.

"అదయ్యిందా. పెన్షను సేంక్షనయ్యింది. మా బావగారే కాయితాలు తీసుకొచ్చి సంతకాలు పెట్టించిడబ్బు తెచ్చుకున్నారు. ఒక్క పైసా కూడా నాకివ్వలేదు. నా బాధ్యతే ఆయనెత్తుకున్నాక అడిగితే బావోదని వూరుకున్నాను...''

"ఒక రోజుతోటీ, ఒక నెలతోటీ తీరిపోయే భాగోతం కాదుగా. అలా ఎందుకూరుకున్నావు? ఇలాంటివి మొదట్లో మనం ఎలా చేస్తే చివర్లో అవే అలవాట్లై వూరుకుంటాయి''

"ఒకవైపు మా అత్తగారీ పోరు. నేను డబ్బు దుబారాచేసి సంసారం తగలేశాననీ, అందుకే ఆయన ఆఫీసు డబ్బు వాడేశారనీ...''



"మీ ఆయన కొని పారేసిన పుస్తకాలు చూపించలేక పోయావు?"

"తెలీకపోతే కదా! లోకువగా దొరికేను గాబట్టి అంది. ఇహ మా తోడికోడలు.. ఈ తద్దినం వాళ్ళకొచ్చి చుట్టుకుందని. ఇంకా చాలా అందిలే. ఆవిడకు మేం వాళ్ళింట్లో ఉండడం యిష్టం లేదు"

"ఇంకేమందేం?"

"ఏవో ఒకటిలెద్దూ! ఆవిడ భయాలు ఆవిడవి. ఈ సందట్లో యిన్సూరెన్సు డబ్బొచ్చింది."

"అదేనా నీ చేతికొచ్చిందా లేదా?"

"దాంతోనే అంతాగుమ్మడిపండు బద్దలైనట్లు భళ్ళుమంది. మీ బావగారి ఆఫీసులో అక్కౌంటెంటు ఆడామె. చాలా గట్టిది. 'ప్రతీదీ ఇంట్లోంచీ సంతకాలు పెట్టించి డబ్బు తీసుకెళ్తున్నారు. మేం పెన్షనర్ని చూడాలి. చూడందే పేమెంటివ్వం' అని పేచీ పెట్టింది.

అప్పటికప్పుడు రిక్షా చేయించి తీసుకెళ్ళారు నన్ను, తీరా చూస్తే ఆవిడ సీటు దగ్గర ఒకటే కుర్చీ ఉంది. నాకు చూపించి కూర్చోమంది. ఇంకోటి తెప్పించడానికి ఫ్యూన్ లేడు. నేను కూర్చుని ఉండగా తను నిలబడి ఉండడానికి చిన్నతనమేసి మా బావగారు అంత దూరాన్ని వెళ్ళి నిలబడ్డారు.

ఆవిడ నన్నడిగింది.- "ఏమ్మా ఇప్పటిదాకా వచ్చిన డబ్బు మీ చేతికొచ్చిందా"- అని.

"నేను ఔనని తలూపానో, లేదని తలూపానో గుర్తు లేదు గానీ, శాంతీ, ఆవిడ నా మొహం చూసి అంతా చదివేసిందే. మా బావగార్ని ఇరుకున పడేసి, అవేవో పత్రాలట. పిల్లల పేర్న కొనిపించింది. యిన్సూరెన్సు డబ్బు పెట్టి ఆ పత్రాలు కొన్నందుకు కూడా డబ్బులొస్తా యట. ఏజెంటుతో మాట్లాడి అవి కూడా ఇప్పించింది.

"చదువుకున్నావా అనడిగింది-

"టెన్త్ పాసయ్యానని చెప్పాను.

"రెండేసి జీతాలొస్తేనే మా అందరికీ చాలడం లేదు. పెన్షన్తో ఎలా బ్రతుకుతున్నావు? అది కూడా ఏడేళ్ళవగానే తగ్గిపోతుంది-" అంది బోసిగా ఉన్ననా మెడా, చేతులూ చూస్తూ. ఆవిడ నాకన్నా బాగా పెద్దది. చదువుకున్నది. నలుగుర్లోకొచ్చి ఉద్యోగం చేస్తున్నది. లోకాన్ని బాగా చదివినది. అలాంటావిడ చూపుల్లో నాకుహేళన కనిపించలేదు.

నాకో నానూ, జతగాజులూ ఉండేవి. చనిపోయే రోజున ఆఫీసులో డబ్బు కట్టాలని అవి తీసుకున్నారు- ఏడుపాపుకుంటూ చెప్పాను.

ఆవిడ కదిలిపోయింది. - "ప్చ్.. ప్చ్.. ఎంత పని జరిగింది? మధు అలాంటి వాడు కాదని మా అందరికీ తెలుసు. ఆ రోజు కౌంటర్లో చాలా కేషొచ్చింది. అతనికి సాయంగా అయిదారుగురు లెక్క పెట్టారు. వాళ్ళలో ఎవరో చేసి ఉంటారీ పని. అదేదో నిదానంగా తేల్చుకుందామనుకున్నాం. ఇంతలోనే ఇలా జరిగిపోయింది-" అంది బాధపడ్తూ.

ఆయనలాంటి వాడు కాడని ఆవిడ కూడా చెప్పాక నాకు చాలా రిలీఫ్గా అనిపించింది శాంతీ!" అంది భువన కళ్ళు తుడుచుకుంటూ.

"మేమెవ్వరం నమ్మలేదు గానీ, మీ ఆయన నీగురించీ, పెల్లల గురించి కూడా ఆలోచించకుండా తన దారి తను చూసుకోవడం బావో లేదే. డబ్బు ఆఫీసులో కట్టేసిన తరువాత సూసైడు చేసుకోవడమెందుకు?"

"ఏదేనా నాతో చెప్తే కాదు? మూడు గంటల వేళ ఆఘమేఘాల మీద వచ్చి, అర్జెంటుగా డబ్బు కావాలి. నీ వంటి మీదున్న బంగారం కావాలి, ఇవ్వమన్నారు. అంతేగానీ ఇదీ సంగతని చూచాయగా కూడా చెప్పలేదు. అవే మేం మాట్లాడుకున్న ఆఖరి మాటలు" చెప్తుంటే కళ్ళనీళ్ళు పొర్లుకొచ్చాయి భువనకి. గొంతు రుద్ధమైంది.

"ఈ మగాళ్ళే అంత. వాళ్ళకి సంబంధించిన వ్యవహారాలు ఊర్లో అందరికీ తెలిసాక గానీ భార్యకి తెలీవు" అన్నాను ఓదార్పుగా.

"ఆవిడతో నేను మాట్లాడుతుంటే మా బావగారొచ్చి ఏంటాలస్యం అన్నారు కసుర్తున్నట్లు. ఆవిడేమనుకుంటుందో నని నేను భయపడ్డాను. కానీ ఆవిడదేం పట్టించుకోకుండా-

"మధుగారి జాబ్ ఈ అమ్మాయికిస్తారు అప్లికేషను పెట్టించండి. ఇప్పుడైతే మా దగ్గిర ఖాళీలున్నాయి. సెలక్షన్స్ జరుగుతున్నాయి. వెంటనే ఇచ్చేస్తారు.-" అంది.

"ఇంటికెళ్ళి ఆలోచించుకోవాలి-" అన్నారాయన.

"అప్లికేషను పెట్టాక కూడా ఆలోచించుకుని అక్కర్లేదనుకుంటే మానెయ్యొచ్చు-" అంది ఆవిడ. అప్పటికప్పుడు అప్లికేషన్ తయారుచేసి, నా చేత సంతకంపెట్టించి వాళ్ళ ఆఫీసుకి పంపించింది.

మేం వచ్చేశాం.

ప్రళయకాల రుద్రుడిలా నా మీద ఎగిరారు బావగారు. నేనేదో చెప్పుకున్నాననీ, అందుకే ఆవిడలా చేసిందనీ అభియోగం. ఉద్యోగం, సద్యోగం అంటే గుండు గొరి గించి కూర్చోబెడతానని అసభ్యంగా మాట్లాడారు"

"అంతా బానే ఉంది గానీ, నువ్వు ఇంటరేనా పూర్తి చెయ్యలేదెందుకని? పరీక్షలు రాస్తానని మీ ఆయన్నడగలేదా?"

"అడిగాను. చదివేం ఉద్ధరించాలని హేళన చేసారు."

"అదేం మనిషే? ఎట్నుంచెటుస్తుందోనని ఎలాంటి వాళ్ళూ కూడా భార్యల చేత వోపెన్ యూనివర్సిటీ బియ్యేకి కట్టించేస్తున్నారు."

"ఆయన యమ్మెస్సీ పాసై ఉద్యోగంలో చేరారు. మళ్ళీ ఇంగ్లీషుతో ఎమ్మే కట్టారు. అది చాలదని లా కాలేజీలో చేరారు. ఇంటర్లో కష్టపడి చదివీ, సరిగ్గా పరీక్షల ముందు పెళ్ళి చేసుకున్న భార్య కూడా తన లాంటి మనిషేననీ, తనలాంటి తపనలూ, తృష్ణ ఆమెకీ ఉంటాయనీ ఎప్పుడూ అనుకోలేదు. ఇంటికి అంకితమై, తన అవసరాలు చూస్తూ పిల్లల్ని కని తరిస్తే చాలు. ఆడదానికి యికేమీ అక్కర్లేదనుకునే మనిషాయన."

"అంత ముతక మనిషిని ఎలా భరించావే బాబూ!"

"బ్రహ్మముడి బిగుసుకుందిగా!"

"మీ పెళ్ళైన ఏడు యింటరు పరీక్షలకి ఫీజు కట్టలేదని తెలిసి ఎంత స్టన్నయ్యానో తెలుసా?"

"పరీక్షలు రాస్తానని బాగా ఏడ్చి గొడవ చేస్తే, నా గోల భరించలేక సరేనన్నారు. అప్పట్లో అత్తగారు మా దగ్గరే వుండేది. నేను పుస్తకం ముట్టుకునే సరికి ఆవిడకి ఎక్కళ్ళేని జబ్బు చేసేసేది. కాళ్ళు పట్టించుకునీ, తల నొక్కించుకునీ నానా హంగామా చేసేది. అదయ్యేసరికి శ్రీవారి పవళింపు సేవలు"

"అది సరే, ఈ ఉద్యోగంలో ఎందుకు చేరావు? కాస్తాగితే క్లరికల్ పోస్టు వచ్చేదేమో!"

"దానికి ఇంటర్ క్వాలిఫికేషన్ కావాలట. నా క్వాలిఫికేషన్కి అటెండర్ పోస్టు ఇప్పిస్తామని, ఇష్టమైతే చేరమని వెంటనే లెటరొచ్చింది. ఆ ఉత్తరం నా మొహాన్న విసిరి కొట్టి, "ఉద్యోగం చేస్తానని ఎగిరెగిరి పడ్డావు గదా. నీ బోడి చదువుకి అటెండరుద్యోగం యిస్తారు. వెళ్ళి జేరు" అని ఎద్దేవా చేసారు మా బావగారూ, ఆయన తల్లీను.

నాకు కచ్చ పుట్టింది. నన్ను చదువు కోనీకుండా చేసి, అశక్తురాలిని చేసి, యిప్పుడు ఎద్దేవా చేస్తున్నారు. ఇదో ఛాలెంజిగా తీసుకుని ఇప్పటికిప్పుడు ఇంటరుకి కట్టే ఓపిక, ఉత్సాహం లేవు నాలో. అవి ఎప్పుడో చచ్చిపోయాయి. లేని యింట్రెస్టు తీసుకుని చదువుకుందామన్నా ఆయన బ్రతికున్నప్పుడే లేనిది ఇప్పుడు చదవనిస్తారా? సరే, ఏదో విధంగా తలక్రిందుల్యగా తపస్సు చేసి చదివి పాసౌతాననుకో. అప్పటికి నాకోసం ఉద్యోగం ఎదురుచూస్తూ ఉంటుందా? ఇంట్లో పరిస్థితులు చెప్పానుగా. వయస్సులో ఉన్న మరదలిని ఇంట్లో పెట్టుకోకూడదని మా తోడికోడలి గొణుగుడు. ఆయనకలాంటి భావం లేకపోయినా ఆవిడ చేసే గోలతో పుట్టుకొస్తుంది. నేనే మా ఆయన్ని పొట్టని పెట్టుకున్నానని అత్తగారి సాధింపు. పిల్లల్ని దగ్గరికి తీసుకుని ఆదరించే వాళ్ళు లేరు. నాది పూర్తిగా అస్వతంత్రమై పోయింది. అంతా అగమ్యగోచరంగా ఉంటే తెగించి ఈ దారి తొక్కాను".

"మీ అన్నయ్యా వాళ్ళు ఏమన్నారు?"

"అన్నయ్య తనతో వచ్చెయ్యమన్నాడు. అక్కడికెళ్ళినా అంతే కదా! ఇక్కడ తోడి కోడలి పెత్తనం. అక్కడ వదిన పెత్తనం. అదీ గాక ఎవరు మాత్రం నా బరువు ఎంతకాలం మోస్తారు? ఎప్పుడో. ఒకప్పుడు అన్నీ తెంచుకుని స్వతంత్రంగా బతకాల్సిన రోజు వస్తుందని నాకు తెలును. ఎందుకంటే నేను ఆత్మాభిమానం చంపుకోలేను. అది చంపుకోనిదే ఒకరింట్లో యిమడను"

"అంతా వింటోంటే మీ ఆయనో తప్పు చేసాడని పిస్తోంది నాకు"

"ఏమిటి? నన్ను చదివించక పోవడమా? నన్నిలా అర్ధ మధ్యాంతరంగా వదిలేసి తన దారి తను చూసుకోవడమా?"

"ఐతే ఒక తప్పు కాదు. రెండు"

"ఇప్పుడెన్ననుకుని ఏం లాభం? "ఆఫీసులో ప్రస్తుతానికి నన్ను గౌరవంగానే చూస్తున్నారు. మధుగారి భార్యనన్న సానుభూతి ఉంది. అది పోకముందే క్లర్కు ఎగ్జామ్ రాసి పాసౌతాను. మా అకౌంటెంటు కోచింగు ఇస్తోంది" అంది భువన దృఢంగా.

"బెస్టాఫ్ లక్.." అన్నాను మనస్ఫూర్తిగా.

సాయంత్రం నన్ను తీసుకెళ్ళడానికి శ్రీవారొచ్చారు. చిన్నతనం పడకుండా ఆయన కూడా వచ్చారని భువన ఎంత సంతోషపడిందో!

తిరిగి ప్రయాణమౌతుంటే నా మనసెంతో తేలికపడింది. ❐